ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
సోమవారం 1 సెప్టెంబరు 2025





పల్లెపోరుకు సమాయత్తం

- జిల్లాలో 3,53,904 మంది ఓటర్లు
- ముసాయిదా జాబితా విడుదల
- వార్డుకు ఒక్కోటి చొప్పున 2,874 పోలింగ్ కేంద్రాలు
- సెప్టెంబరు 1న అభ్యంతరాలు, 2న పరిష్కారం, తుది జాబితా

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు అధికా రులు సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్ని కలకు అధికారులు ముసాయిదా జాబితాలు ఆయా గ్రామ పంచాయ తీల్లో ప్రదర్శించారు. ఇప్ప టికే బ్యాలెట్ బాక్సులు, పోలింగు కేంద్రాల పరిశీలన, తదితర ఏర్పాట్లు పూర్తి కాగా ప్రస్తుతం వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాలను విడుదల చేశారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, బీఎల్వోలు ఇంటి నంబర్ల ఆధారంగా వేర్వేరు చోట్ల ఉన్న కుటుంబ సభ్యులను ఒకే చోట, ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకో వాలని ఆదేశాలతో అంతా సిద్ధం చేశారు. గత 2024 ఫిబ్రవరి 1న సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో 335 పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. జిల్లాలోని 15 జడ్పీటీసీ, 15 ఎంపీపీలు, 123 మంది ఎంపిటీసీ సభ్యుల పదవీ కాలం గత ఏడాది జూలై 4న ముగిసింది. ఆయా గ్రామాల్లో కొంత కాలంగా అభివృద్ధి కుంటు పడుతోందని ఆరోపణల మధ్య గ్రామ పంచాయతీల ఎన్నికలకు సమాయత్తం అవుతుండడంతో ఆశావాహులు పోటీకి సిద్ధమవుతున్నారు.

● ఆయా గ్రామ పంచాయతీల్లో..

ముసాయిదా జాబితా వివరాల ప్రకారం ఆయా గ్రామపంచాయతీలలో వచ్చే అభ్యంతరాలను సెప్టెంబరు 1 వరకు డీపీవో అభ్యంతరాలను స్వీక రించి 2న పరిష్కరించనున్నారు. అనంతరం తుది జాబితా విడుదల చేస్తారు. ముసాయిదా జాబితా ప్రకారం మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళలు 664 మంది ఎక్కువగా ఉన్నారు. ఇప్పటికే జిల్లాలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహి స్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పల్లె పోరుకు జిల్లా అధికార యంత్రాగం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీల కార్య దర్శులు కార్యాలయాలో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ అంటించారు. తుది జాబితా సిద్ధం చేసి పంచాయతీ పోరుకు సిద్ధమవుతున్నారు.

మండలాల వారీగా ఓటర్ల సంఖ్య

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆసిఫాబాద్	15,043	15,281	0	30,324
బెజ్జూరు	11,685	12,047	2	23.734
చింతలమానెపల్లి	12,118	11,837	0	23,955
దహెగాం	11,014	11,077	1	22,092
జైనూరు	11,935	12,427	0	24,363
కాగజ్‌నగర్	22,857	22,383	2	45,242
కెరమెరి	12,145	11,800	1	24,026
కౌటాల	13,796	13,580	1	27,357
లింగాపూర్	5,103	5,479	1	10,583
పెంచికల్‌పేట్	6,218	6,064	0	12,302
రెబ్బెన	14,523	14,261	0	26,724
సిర్పూర్(టి)	11,016	11,163	3	22,182
సిర్పూర్ (యు)	5,835	6,440	2	12,277
తిర్యాణి	6,863	9,281	4	18,148
వాంకిడి	14,458	14,134	3	28,595
మొత్తం	1,76,610	1,77,274	20	3,53,904

● 15 మండలాల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఉన్న 335 గ్రామ పంచాయతీలలో 2874వార్డులకు గానూ 2874 పోలింగు కేంద్రాలుంటాయని అధికారులు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఒక్కో వార్డుకు ఒక్కో పోలింగ్ కేంద్రం ఉంటుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి విడతలో, రెండో విడతలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఆర్వోలకు పలు చోట్ల శిక్షణనిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్తగా ఓటర్లు నమోదుతో జాబితా సిద్ధం చేశారు. కొత్త గ్రామ పంచాయతీలు, రెవెన్యూ గ్రామాలకు చెందిన ఓటర్లను కూడా జాబితాలో చేర్చారు.

వాగులో పడి ఒకరి మృతి



మహబూబ్(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 31 (ఆంధ్ర జ్యోతి): కుమరం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలం గొడవెల్లి పెద్దవాగులో ప్రమాదవశాత్తు నీట మునిగి జైనూరు మండలం పాట్నాపూర్ గ్రామానికి చెందిన మహబూబ్ (17) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. ఆసిఫాబాద్ పట్టణంలోని రాజంపేటకు చెందిన అన్నదమ్ములు రేహన్, అయాన్‌తో పాటు వీరి మేనత్త కొడుకు మహబూబ్ ఆదివారం గొడవెల్లి పెద్దవాగులో స్నానానికి వెళ్లారు. మొదట మహబూబ్ వాగులోకి దిగాడు. వరద ప్రవాహానికి మహబూబ్ కొట్టుకు పోతుండగా అతడిని కాపాడడం కోసం రేహన్ వెళ్లాడు. ఇద్దరు కొట్టుకుపోతుండగా వాగువద్ద ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ రేహన్ చేయిపట్టుకొని బయటకు లాగాడు. మహబూబ్ మాత్రం గల్లంతయ్యాడు. సమాచారం మేరకు సీఐ బాలాజీ వరప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. సంఘటన స్థలం నుంచి 100 మీటర్ల దూరంలో మహబూబ్ మృతదేహం లభ్యమైంది. సీఐ బాలాజీ వరప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున పిల్లలను వాగుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు కట్టడి చేయాలని సూచించారు.

బురదలో కూరుకుపోయిన వాహనం



బురదలో దిగబడిన వాహనం

పెంచికలపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గుండెపల్లి- బెజ్జూరు ప్రధాన రహదారి ఇటీవల కురసిన వర్షాలకు గుంతలతో బురద మయంగా మారడంతో వాహనాలు కూరుకుపోతున్నాయి. ఆదివారం వార సంత నేపథ్యంలో బెజ్జూరు మండల కేంద్రానికి వెళ్తున్న క్రమంలో టాటా ఏసీ వాహనం బురదలో కూరుకు పోవడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మోకాళ్ల లోతు బురదలో దిగబడిన వాహనాన్ని పెట్టి బయటకు తీశారు. ఈ సమస్యపై పలు మార్లు అధికారులకు విన్నవించుకున్నా పరిష్కారం చూపడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

జాతీయ ఆరోగ్యమిషన్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్‌లో పని చేస్తున్న సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్ మోడల్ స్కూల్‌లో జిల్లా మమహాసభ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అధికారంలోకి వచ్చి 21 నెలలు గడుస్తున్నా ప్రభుత్వ సంస్థలో పని చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు సవరించి పెంచకుండా గత ప్రభుత్వాలు లాగే దగా చేస్తుందని, వెంటనే కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఉపేందర్, అధ్యక్షులుగా గణేష్, షకీల్, ఉపాధ్యక్షులుగా చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మధుకర్, సహాయ కార్యదర్శిగా ముస్తాక్‌హుస్సేన్, కోశాధికారిగా నాగేష్, ఈసీ కౌన్సిల్ మెంబర్‌గా సౌమ్యను ఎన్నుకున్నారు.

గుడుంబాను అరికట్టాలి



మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

దహెగాం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గుడుంబాను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి అన్నారు. దహెగాం మండలం మర్రిపల్లి గ్రామంలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో 30 లీటర్ల బెల్లం పానకం లభించడంతో ధ్వంసం చేసినట్లు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత గుడుంబాకు బానిసై తమ జీవితాలను కోల్పోతున్న వారికి కడుపు కోతను మిగుల్చుతున్నారన్నారు. గుడుంబా తయారు చేసినా, విక్ర యించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాలు, 1930, డయల్ 100 గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు విక్రమ్, అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌కు ఘన నివాళి



గణపురం శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గణపురం శ్రీనివాస్ సంస్మరణ సభ సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు గజ్జిరామయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు చిలువేరు సత్యనారాయణ, కాసం శ్రీనివాస్, గణపురం ప్రకాష్, కేసెట్టి శంకరయ్య తదితరులు నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గణపురం శ్రీనివాస్ ప్రజా సంక్షేమం, రైతుల కోసం పాటుపడ్డారని కొనియాడారు.

అడవి పంది దాడిలో రైతుకు గాయాలు

పెంచికలపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన దూగుంట నారాయణ అనే రైతు పత్తి చేనులో పనులు చేస్తున్న క్రమంలో అడవి పంది దాడి చేసి గాయపరిచింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. నారాయణ వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో అడవి పంది ఒక్క సారిగా దాడి చేసింది. బిగ్గరగా కేకల్ వేయగా చుట్టు పక్కల రైతులు గమనించి రావడంతో పారిపోయింది. సదరు రైతు చేతులపై, కాళ్లపై గాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్‌ను సంప్రదించగా అడవి పంది రైతుపై దాడి చేసినట్లు ధృవీకరించారు. ఆసుపత్రికి వెళ్లి విచారణ నిర్వహించినట్లు తెలిపారు.

పూజలు.. అన్నదానాలు



ఆసిఫాబాద్ మండలం గుండిలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన గణనాధుల వద్ద ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండలీల నిర్వాహకులు అన్నాదానం చేశారు. జిల్లా కేంద్రంలోని వివిధ వినాయక మండపాల వద్ద ఆదివారం అన్నదానాలు జోరుగా కొనసాగాయి. వినాయకులను ప్రతిష్ఠించి ఐదు రోజులు అయిన నేపథ్యంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయంలో బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో, సిద్ధి వినాయక నగర్, రాజంపేట, కస్నాబ్‌వాడి, కంచుకోటలలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దస్నాపూర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద వేద పండితులు సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చన పూజలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గొల్లవాడలో ప్రతిష్ఠించిన గణేశ్ మండలి వద్ద ఆదివారం మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. గొల్లవాడలో గణేష్ మండలి ఏర్పాటు చేసిన 30 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



సిర్పూర్(టి)లో కుంకుమార్చన పూజలో పాల్గొన్న మహిళలు

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాల గణేశ్‌మండలి వద్ద భక్తులు 21 రకాల నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రులను పురస్కరించుకుని ప్రతి రోజు రకరకాల పూజలతో నైవేద్యాలు సమర్పిస్తున్నారు.

కెరమెరి,(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణేశ్ మండలీల వద్ద భక్తులు ప్రత్యేక పూజుల్లో పాల్గొన్నారు. ప్రతి రోజు ప్రత్యేక పూజలు అన్నదానాలు నిర్వహిస్తున్నారు. అలాగే రాత్రి సమయాల్లో భజనలు నిర్వహిస్తున్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



ఆసిఫాబాద్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మోదీ తల్లిని కించపరిచేలా మాట్లాడడంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ శ్రేణులు ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, వన్ నేషన్ వన్ ఎలక్షన్ చైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ తల్లిని రాహుల్ గాంధీ కించపరిచేలా మాట్లాడడం సరైన విధానం కాదన్నారు. నేరుగా ఎదుర్కొనలేక నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ప్రధాని మోదీ తల్లికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మల్లికార్జున్ యాదవ్, పెంటన్న, విజయ్, కోట్నాక విజయ్, ప్రహ్లాద్, వీరభద్రచారి, మురళీగౌడ్, బిజ్జు, వినోద్, గొల్ల, మధుకర్, రాములు, పోశన్న, శంకర్, రేణుక, రే వతి, స్వరూప, కిరణ్, కోటేష్, లచ్చన్న, జయరాజ్ పాల్గొన్నారు.

రెబ్బెన , (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు రెబ్బెనలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహ నం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మల్లాజ్ రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్, ట్రెజరర్ మధుకర్, కార్యదర్శి వెంకన్న, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పూలాజీబాబా ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండి గ్రామంలో పూలాజీబాబా ఆలయ నిర్మాణానికి, గంగపుత్ర సంఘం వద్ద రేకుల షెడ్డు నిర్మాణానికి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచ్ అరుణతో కలిసి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, ప్రవీణ్‌రాజు, రోజ, లచ్చుంబాయి, అంజుబాయి, నాగు, గణపతి, భీము, కాశీనాథ్, బాబురావు, గణపతి, బాపన్, రమేష్, శంకర్, శ్రీను, రమేష్, బలవంత్, సదు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు



శ్రమదానం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం సాలెగూడ గ్రామ రోడ్డు దెబ్బతినడంతో బీజేపీ సీనియర్ నాయకుడు అనిగెలనాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్ తదితరులు ఆదివారం శ్రమదానంతో మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది దీపక్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ జిల్లా కార్యవర్గం

కాగజ్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూటీఎస్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తౌటం శ్యాం సుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా పార్వతి రాజేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. జిల్లా వైస్ ప్రసిడెంట్లుగా వేణు, సబీర్, సత్యనారాయణ, రాజు, రాజేష్, దుర్గం పూర్ణిమా, రజియా సుల్తానా, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా చిలుకూరి రవీందర్, మదాసు శ్రీనివాస్, బంక శారద, చంద్రకళ, జిల్లా సెక్రటరీగా సురేష్, వస్రాం, సుస్మిత, ఉమారాణి, సుప్రియ, అరుణ కుమారి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మధూకర్, రాష్ట్ర కార్యదర్శులు తిరుపతయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

నెరవేరిన కల

- వందేభారత్ నిలుపుదల ప్రకటనతో సంబరాలు
- కాగజ్‌నగర్‌వాసులకు మెరుగుపడనున్న రవాణా సౌకర్యం



కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్

కాగజ్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో వందేభారత్ హాల్టు ప్రకటనతో పట్టణంలో ఆదివారం సంబరాలు నిర్వహించారు. నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు కేవలం నాగ్‌పూర్, కాజీపేట, సికింద్రాబాద్ హాల్టు మాత్రమే ఉండేది. ఈ రైలుకు కాగజ్‌నగర్, మంచిర్యాల, రామగుండం హాల్టులను ఇస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగజ్‌నగర్‌కు ఉదయం 8 గంటలకు బయలుదేరనుంది. సికింద్రాబ్రాద్‌కు 12 గంటల వరకు చేరనుంది. కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లాలంటే ఉదయం భాగ్యనగర్, ఇతర వీక్లీ రైళ్లు మాత్రమే ఉంటున్నాయి. ఇవీ కూడా 8 గంటలు దాటితే ఒక్కటికి కూడా ఉండదు. మళ్లీ 11 గంటల నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితుల్లో అత్యవసరమున్న సికింద్రాబాద్‌కు వెళ్లాలంటే కార్లను బుక్ చేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రైల్వేశాఖ ప్రకటించిన తర్వాత ఇప్పుడు అందరికి సమస్య తీరనుంది. అలాగే సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు కూడా మధ్యాహ్నం 1 గంట లకు బయలు దేరితే కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌కు 5 గంటలకు వచ్చేట్టు సమయాన్ని నిర్ణయించారు. సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12 గంటల తర్వాత కూడా నేరుగా కాగజ్‌నగర్‌కు వచ్చేందుకు ఎలాంటి రైళ్లు లేవు. కేవలం భాగ్యనగర్ కూడా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి నిత్యం మధ్యాహ్నం 3 గంటల వరకు, దక్షిణ్, ఇతర ఎక్స్‌ప్రెస్‌లు కూడా రాత్రి 9 తర్వాతే ఉన్నాయి. తిరుగు ప్రయాణం సమస్య కూడా తీరనుందని చెబుతున్నారు. కాగా ఈ రైలు ఎప్పటి నుంచి హాల్టింగ్ ఇస్తారన్నది ఇంకా ప్రకటించాల్సి ఉంది. కాగా ఈ రైలు కోసం గతేడాది నుంచి సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబు తీవ్రతమైన కృషి చేశారు. రైల్వే మంత్రితో పాటు రైల్వే జీఎంకు కూడా వినతి పత్రాలను అందజేసి సమస్యను వివరించారు. ఈ మేరకు ఆయన కృషి ఫలించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావన

కాగజ్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొన్న సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆదివారం ప్రస్తావించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి 22 నెలలుగా నిధులు విడుదల కావడం లేదని, దీంతో పారిశుధ్య నిర్వహణ కష్టంగా ఉందని సభా దృష్టికి తీసుకవచ్చారు.

గుండె శస్త్రచికిత్సకు తరలింపు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 31 (ఆంధ్ర జ్యోతి): ఇటీవల గుండె వ్యాధుల నిర్ధారణ పరీక్షల్లో శస్త్ర చికిత్స అవసరమని గుర్తించిన బాధితులను సిద్దిపేటకు బస్సులో తరలించారు. జిల్లా వైద్యాధికారి సీతారాం మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్స చేయడం ఎంతో గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో ఆర్బీఎస్‌కే నోడల్ అధికారి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలుపు మందులు అతిగా వాడొద్దు

● లేకపోతే పంట దెబ్బతినే ప్రమాదం

● రైతులకు వ్యవసాయ అధికారుల సూచనలు

బెజ్జూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రైతులు కలుపుమందు అతిగా వాడొద్దని అధికారులు చెబుతున్నారు. సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో పాటు జిల్లాలోని సాగునీటి జలాశయాలు చెరువులు నిండడంతో ఆయకట్టు సాగులో సందడి కనిపిస్తోంది. బోర్లు, బావుల కింద నాట్లు ముగిశాయి. పంటల సాగులో రైతులు ఎదుర్కొనే ప్రధాన సమస్య కలుపు మొక్కల నివారణ. ఎంత తొలగించినప్పటికీ ప్రతి 15 నుంచి 20రోజుల్లో పంట కంటే ఎక్కువగా ఈ కలుపు మొక్కలే పీల్చేస్తాయి. అందుకే కలుపును సమూలంగా నివారించేందుకు దశాబ్దాల క్రితమే రసాయన మందులు వచ్చాయి. అయితే వీటిని ఎంత మేరకు వినియోగించాలి, వాడాలి అనే విషయమై రైతులు అవగాహన కలిగి ఉంటే మేలు. కలుపు మందులను ఎంత మోతాదులో వాడాలో, ఏకాలంలో పిచికారి చేయాలో తెలియక రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ రైతులు కలుపు నివారణ మందులు వినియోగించాలి. వీటిని నిర్ణీత పరిమాణం మేరకే వాడాలి. మోతాదు మించితే పంట మొక్కలకు, విత్తనాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. నేల సైతం తన సహజత్వాన్ని కోల్పోతుంది. వ్యవసాయ అధికారుల సిఫారసు మేరకు కలుపు మందులు వాడాలి. జాగ్రత్తలు తీసుకొని మందులు పిచికారి చేయాలి.





● ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- పురుగు మందులు, కలుపు మందులు వేర్వేరుగా నిల్వ చేసుకోవాలి. కలుపు మందులు వాడేటప్పుడు అంటే పిచికారి చేసేటప్పుడు ఇతర రైతుల పంట మొక్కలపై పడకుండా చూసుకోవాలి.
- ఈ మందు మనుషులు, పశువులు, పక్షులు తినే ఆహార పదార్థాలపై పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని పిచికారి చేయాలి.
- వరిలో కలుపు మొక్కల నివారణకు వరి నాటిన 2నుంచి 5రోజుల వ్యవధిలో బ్యూటోక్లోర్ అనే మందు ఒక ఎకరానికి లీటరు గానీ లీటరున్నర లేదా అనిలోఫాస్ మందు 500మి.లీ. నుంచి 600మిల్లీ లీటర్లు లేదా ప్రిటిలాక్లోర్ మందు 500 మి.లీటర్ల ఇసుకలో కలిపి చల్లుకోవాలి.
- వరి నాటిన 20నుంచి 25రోజుల తర్వాత పొలంలో ఇంకా వెడల్పాకు గడ్డి, మొండిజాతి గడ్డి వంటి కలుపు మొక్కలు గుర్తిస్తే 2.4డీ సోడియం సాల్ట్ పొడి మందును ఎకరానికి 600నుంచి 800గ్రాముల మందును 200లీటర్ల నీటిలో కలిపి నేలపై పిచికారి చేయాలి. లేదా ఒక ఎకరానికి బిస్‌పైరిబాక్ సోడియం అనే మందును 100మిల్లీలీటర్లు పిచికారి చేయాలి.
- మోతాదుకు మించి వినియోగిస్తే పంటలకు నష్టం వాటిల్లుతుంది. ఈ మందు పత్తి, మినుము, పెసరు పంటలపై వాడొద్దు.
- కొన్నిరకాల కలుపు మందులు కలుపుమొక్కలతో పాటు పంటను కూడా ఒకేసారి నిర్మూలిస్తాయి.
- మొండిజాతి కలుపు మొక్కలు గర్క, తుంగ, దర్భ మొక్కలపై గ్లైపోసెట్ మందు పిచికారి చేయాలి. కలుపు మొక్కలు నాలుగు ఆకుల నుంచి ఆరు ఆకుల దశలో మందు కొట్టాలి. నీటిలో కరిగే పొడి కలుపు మందులను ఇసుకలో గానీ యూరియాలో గానీ కలిపి చల్లరాదు.
- హ్యాండ్ స్ప్రేయర్లతోనే పిచికారి చేయాలి. పవర్ స్ప్రేలు వాడొద్దు.
- కలుపు నివారణ మందును పంట కాలంలో ఒకసారే పిచికారి చేయాలి. పొలంలో వెనుకకు నడుస్తూ స్ప్రే చేయాలి.
- పత్తి పంటలో కలుపు నియంత్రణ చాలా ముఖ్యమైనది. ఎందుకంటే కలుపు మొక్కలు పత్తికి పోటీగా నీరు , ఎరువులు, వెలుతురు, పోషకాలు వాడేసుకుంటాయి. దాంతో పత్తి పంట దిగుబడి 30-40శాతం వరకు తగ్గిపోవచ్చు.
- పత్తిలో విత్తనాలు వేసిన 20-25రోజులకు మొదటి కలుపు తీయాలి. 40-45రోజులకు రెండవ కలుపు తీయాలి. కలుపు యంత్రాలు వాడితే శ్రమ తక్కువ అవుతుంది. నాటిన తర్వాత మొదటి 45రోజులు పంట కలుపు లేకుండా ఉంచితే బాగుంటుంది.

వ్యవసాయ అధికారుల సూచన మేరకు వాడాలి..

- నాగరాజు, వ్యవసాయ అధికారి, బెజ్జూరు



వరిలో కలుపు మొక్కల నివారణకు రైతులు వ్యవసాయ అధికారులు సూచించిన సిఫారసు మేరకు కలుపు మందులు వినియోగించాలి. ఎక్కువ మోతాదులో వాడితే పంటకు కూడా నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. మందులను ఎక్కువగా వాడి పంటను నాశనం చేసుకోవద్దు. కలుపు మందులు పిచికారి చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

కైరిగూడ ఓపెన్‌కాస్టు శివారులో పులి సంచారం



కైరిగూడ ఓపెన్‌కాస్టు శివారులో సంచరిస్తున్న పులి

రెబ్బెన , ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన, తిర్యాణి మండలాల సరిహద్దులో గల కైరిగూడ ఓపెన్ కాస్టు పరిసరాల్లో పెద్దపులి సంచరిస్తోంది. శనివారం రాత్రి ఓపెన్‌కాస్టు చెక్ పోస్టు సమీపంలో పెద్దపులి సంచరిస్తుండగా సిబ్బంది సెల్‌ఫోన్‌లో ఫొటోలు, వీడియోలు తీశారు. పులి సంచరిస్తున్న ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ చేయడంతో ఓపెన్‌కాస్టు విధులకు వచ్చే కార్మికులు, పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి, తాండూరు తదితర మండలాల ప్రజలు రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న గడ్డి మందు పట్టివేత

వాంకిడి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న గడ్డి మందును శనివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. శనివారం రాత్రి వాహనాల తనిఖీల్లో భాగంగా మహారాష్ట్ర వైపు నుంచి వస్తున్న కారు(ఏపీ 28సీ.0888)ను ను తనిఖీ చేయగా అందులో నిషేధిత గడ్డ మందు లభ్యమైందన్నారు. అందులో 243 లీటర్ల ఫైజాక్, రౌండప్, క్లింటన్ అనే పేర్లతో గల గడ్డి మందు 120 కిలోల టాపర్ గడ్డి మందు పొడి ఉందన్నారు. వీటి విలువ సుమారు రూ. 1,48, 390 ఉంటుందని చెప్పారు. గడ్డి మందును, కారును స్వాధీనం చేసుకొని వ్యవసాయ అధికారి సమక్షంలో పంచనామా చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

బ్యాంకు స్కామ్‌ను ఛేదించిన పోలీసులు

- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝూ



స్వాధీనం చేసుకున్న బంగారాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చెన్నూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎస్‌బీఐ బ్యాంకు-2లో జరిగిన గోల్డ్‌లోన్, నగదు స్కామ్‌ను పోలీసులు ఛేదించారు. వారం రోజులుగా సంచలనం రేపిన ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన బ్యాంకు క్యాషియర్ నరిగె రవీందర్, మరో 45 మంది నిందితులు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆదివారం రామగుండం పోలీస్ కమీషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ అంబర్ కిశోర్ ఝూ వివరాలను వెల్లడించారు. బ్యాంకులో అవకతవకలు జరిగినట్లు 402 మందికి సంబంధించిన గోల్డ్‌లోన్ అకౌంట్‌లలోని బంగారం 25కిలోల 17గ్రాములు, రూ. 1.10 కోట్లు దుర్వినియోగం అయినట్లు ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రితీష్‌కుమార్ గుప్తా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీపీ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో దర్యాప్తు బాధ్యతలను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌కు అప్పగించారు. ప్రత్యేక బృందాలు బ్యాంకులో శోధనలు జరిపి క్యాషియర్ నరిగె రవీందర్ అకౌంట్‌పై ఆడిట్ నిర్వహించడంతో ఇందులో పెద్ద మొత్తంలో అవకతవకలు, అనుమానాస్పదంగా భారీ మొత్తంలో జమలు ఉన్నట్లు గుర్తించారు. ప్రధాన సూత్రధారి నరిగె రవీందర్‌ను అరెస్టు చేసి విచారించగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లలో 2024 అక్టోబరుకు ముందు రూ. 40 లక్షలు కోల్పోయినట్లు ఒప్పుకున్నాడని, తన నష్టాన్ని తిరిగి పొందడానికి బెట్టింగ్‌లు కొనసాగించడానికి బ్యాంకు మేనేజర్ ఎన్నపురెడ్డి మనోహర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అటెండర్ లక్కాకుల సందీప్‌లతో కలిసి బ్యాంకులో మోసం చేయాలని పథకం వేసినట్లు తెలిపారు. బ్యాంకు కరెన్సీ చెస్ట్ తాళాలు మేనేజర్, క్యాషియర్ ఇద్దరి సంయుక్త ఆధీనంలో ఉండగా మేనేజర్ తన తాళాన్ని క్యాషియర్‌కు ఇచ్చాడని, దీన్ని ఉపయోగించుకుని రవీందర్ బంగారం, నగదును దొంగలించాడని పేర్కొన్నారు. ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని బయటకు తీసి తన స్నేహితుడైన ఎస్‌బీఎఫ్‌సీ బ్యాంకు మంచిర్యాల సేల్స్‌మేనేజర్ కొంగొండి బీరయ్య , అదే బ్యాంకు కస్టమర్స్ రిలేషన్ మేనేజర్ కొడపి రాజశేఖర్, బ్యాంకు సేల్స్ ఆఫీసర్ బొల్ల కిషన్‌లకు ఇచ్చేవాడని, వారు ఆ బంగారాన్ని గోల్డ్ ఫైనాన్స్ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి లోన్‌లు తీసుకుని వచ్చిన డబ్బును ఖాతాల్లో జమ చేసుకుని కొంత కమీషన్ తీసుకుని మిగితా మొత్తాన్ని రవీందర్‌కు పంపేవారన్నారు. ఇలా పది ప్రైవేటు గోల్డ్ కంపెనీల్లో 44 మంది పేర్లతో 142 గోల్డ్‌లోన్‌లు తీసుకున్నారని పేర్కొన్నారు. అలాగే క్యాషియర్ రవీందర్ తన కుటుంబీకుల పేర్లతో పాటు సన్నిహితుల పేర్లతో 42 నకిలీ ఖాతాలు సృష్టించి బంగారం లేకుండానే గోల్డ్‌లోన్‌లు మంజూరు చేసి 4కిలోల 14 గ్రాముల బంగారం తాకట్టు పెట్టినట్లు చూపించి కోటి 58 లక్షల రూపాయలు కాజేశాడన్నారు. అలాగే ఏటీఎంలలో డబ్బులు నింపే సమయంలో రవీందర్ చేతివాటం ప్రదర్శించేవాడన్నారు.

15కిలోల 237 గ్రాములు..

దర్యాప్తు బృందం చాకచక్యంగా విచారణ జరిపి 15కిలోల 237 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌బీఎఫ్‌సీ, ఇండేన్ మనీ, గోదావరి అర్బన్, ముత్తూట్ మనీ, ఐఐఎఫ్ఎల్ కంపెనీల నుంచి బంగారం స్వాధీనం చేసుకున్నామని , ఇక మిగిలిన బంగారం ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, మణప్పురం మంచిర్యాల, మణప్పురం మార్కెట్ ఏరియా (మంచిర్యాల), ముత్తూట్ ఫిన్‌కార్ప్, ముత్తూట్ ఫిన్ (చెన్నూరు), ముత్తూట్ మిని (చెన్నూరు) నుంచి స్వాధీనం చేసుకోవాల్సి ఉందన్నారు. ఇందులో కంపెనీ మేనేజర్ల పాత్రపై పరిశీలన జరుగుతుందని, ఇప్పటి వరకు 44 మంది నిందితులను అరెస్టు చేశామని, ఇద్దరు పరారీలో ఉన్నారని, ఇందులో ముగ్గురు బ్యాంకు ఉద్యోగులు కాగా, మిగితా 43 మంది సహకరించిన వ్యక్తులు ఉన్నారని పేర్కొన్నారు.

నిందితులు వీరే..

ఏ1గా నరిగె రవీందర్, క్యాషియర్, గ్రామం శెట్‌పల్లి,ఏ2గా ఎన్నపురెడ్డి మనోహర్, బ్రాంచ్ మేనేజర్, ముత్తరావుపల్లి గ్రామం ఏ3గా లక్కాకుల సందీప్, అటెండర్, చెన్నూరు గ్రామం,ఏ4గా కొంగండి బీరయ్య, సేల్స్‌మేనేజర్ , ఎస్‌బీఎఫ్‌సీ బ్యాంకు, మంచిర్యాల,ఏ5గా కోదాటి రాజశేఖర్, కస్టమర్ రిలేషన్ మంచిర్యాల ఎస్‌బీఎఫ్‌సీ, మంచిర్యాల, ఏ6గా బొల్లి కిషన్‌కుమార్, సేల్స్ ఆఫీసర్ ఎస్ బీఎఫ్‌సీ, మంచిర్యాల, ఏ7గా ఉమ్మాల సురేష్, ఫొటోగ్రాఫర్ , శెట్‌పల్లి గ్రామం, ఏ8గా నడిగొట్టు సాగర్, రాళ్లపేట, మంచిర్యాల, ఏ9గా రాంశెట్టి చంద్రబాబు, రామకృష్ణపూర్, ఏ10గా భరతపు రాకేష్, ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి, రామకృష్ణపూర్ ఏ11గా దిగుట్ల సునీల్, లక్ష్మీనగర్, మంచిర్యాల,ఏ12గా కడం రమేష్, రామకృష్ణపూర్, ఏ13గా దారపు నాగరాజు, ప్రైవేటు ఉద్యోగి, మంచిర్యాల, ఏ14గా నిట్టూరి రాజు, గ్రామం నారాయణపూర్, చెన్నూరు, ఏ15గా కంబాల మహేష్, ప్రైవేటు ఉద్యోగి, గ్రామం ఐనా, దహెగాం మండలం,ఏ16గా కంది మల్లేష్, గోదావరి అర్బన్ బ్యాంకు ఉద్యోగి, కాలేజీ రోడ్డు, మంచిర్యాల, ఏ17గా జూపాక సత్యనారాయణ, ఐఐఎఫ్ఎల్ ఉద్యోగి, మంచిర్యాల,ఏ18గా దయ్యాల మహేందర్, కుందారం గ్రామం,ఏ19గా ఉరుగొండ పరంధాములు, ఎస్‌బీఎఫ్‌సీ బ్యాంకు సెక్యూరిటీ గార్డు, మందమర్రి, ఏ20గా కుమ్మరి నగేష్, లక్ష్మీపూర్, సిరొంచ, మహారాష్ట్ర

ఏ21గా మహ్మద్ రషీద్, గోదావరి అర్బన్ బ్యాంకు ఉద్యోగి, మంచిర్యాల,ఏ22గా దాడి రాజ్‌కుమార్, ఐఐఎఫ్ఎల్ బ్యాంకు ఉద్యోగి రామకృష్ణపూర్, ఏ23గా కన్నం రాకేష్, ట్యూజన్ ఫైనాన్స్ ఉద్యోగి, మంచిర్యాల,ఏ24గా నేరెడిగొండ అనిల్, నర్సింగాపూర్,ఏ25గా దుర్కె ప్రవీణ్‌కుమార్, శెట్‌పల్లి గ్రామం,ఏ26గా బొడ్డుపల్లి ప్రశాంత్, శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ ఉద్యోగి, మంచిర్యాల,ఏ27గా మంతెన రాజశేఖర్, పొనూరు గ్రామం, ఏ28గా కొమ్ము మహేష్, శెట్‌ల్లి గ్రామం, ఏ29గా పంచాల శశిధర్, రాళ్లపేట, మంచిర్యాల ఏ30గా దుర్గం మనోహర్, బూరుగుపల్లి గ్రామం,ఏ31గా జాకావర్ మహేష్, మోబిన్‌పేట, సిరొంచ, మహారాష్ట్ర,ఏ32గా మహ్మద్ హబీబ్ పాషా, రామకృష్ణపూర్, ఏ33గా జంగంపల్లి యుగేందర్, చున్నంబట్టివాడ, మంచిర్యాల,ఏ34గా మహ్మద్ సమీరొద్దీన్, ఇండేల్ మనీ ఫైనాన్స్ ఉద్యోగి, మంచిర్యాల,ఏ35గా మోత్కూరి శ్రీనివాస్ , మణప్పురం బ్యాంకు ఉద్యోగి మంచిర్యాల,ఏ36గా తాళ్లండి అంజయ్య, గ్రామం కొత్తూరు, నెన్నెల మండలం,ఏ37గా నిమ్మతి సుమ, చున్నంబట్టివాడ, మంచిర్యాల (పరారీలో ఉంది)

ఏ38గా పాని రవళి, రామకృష్ణపూర్,ఏ39గా ఈసంపల్లి సాయికిరణ్, శెట్‌పల్లి గ్రామం,ఏ40గా నరిగె స్వర్ణలత, శెట్‌పల్లి గ్రామంఏ41గా గౌడ సుమన్, ప్రైవేటు ఉద్యోగి, శెట్‌పల్లి,ఏ42గా సుండి సురేష్, కమాన్‌పూర్, పెద్దపల్లి,ఏ43గా జుర్రు శ్రీనివాస్, సీతారాంపల్లి, నస్పూర్,ఏ44గా తుంగపిండి శేఖర్ (పరారీలో ఉన్నాడు),ఏ45గా నరిగె సరిత, శెట్‌పల్లి గ్రామం,ఏ46గా మోత్కూరి రమ్యలను అరెస్టు చేసి ఆదివారం చెన్నూరు మున్సిఫ్ కోర్టు జడ్జి పర్వతపు రవి ముందు హాజరు పరిచారు.

ప్రత్యేక బృందానికి ప్రశంసలు..

ఈ కేసు బహిర్గతం కావడంతో పాటు కేసును ఛేదించిన ప్రత్యేక బృందం పోలీసు అధికారులను సీపీ అంబర్ కిశోర్ ఝూ అభినందించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూరు సీఐ దేవేందర్‌రావు, చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, డబ్ల్యూటీఎస్ ఇన్స్‌పెక్టర్ నరేష్‌కుమార్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ బాబురావు, ఎస్‌ఐలు సుబ్బారావు, శ్రీధర్, రాజేందర్, శ్వేత, సంతోష్, లక్ష్మీప్రసన్న, కోటేశ్వర్, ఉపేందర్‌రావు, చంద్రశేఖర్, రవిలతో పాటు హెడ్ కానిస్టేబుల్లు శంకర్, రవి, కానిస్టేబుళ్లు రమేష్, ప్రతాప్, తిరుపతి , లింగమూర్తిలను సీపీ అభినందించి ప్రశంసలు అందించారు. 46 మంది నిందితులపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులకు వైద్య పరీక్షలు

బ్యాంకు స్కామ్ కేసులో పట్టుబడిన 44 మంది నిందితులకు పోలీసులు ఆదివారం చెన్నూరు సామాజిక ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం చెన్నూరు మున్సిఫ్ కోర్టు జడ్జి రవి ముందు వారిని ప్రవేశపెట్టారు. అనంతరం వీరిని రిమాండ్‌కు తరలించారు.

రాజంపేటలో చోరీ

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాజంపేటలో శనివారం రాత్రి బీరెల్లి సురేష్ ఇంట్లో చోరీ జరిగింది. రాజంపేటలో నివాసం ఉంటున్న బీరెల్లి సురేష్ కుటుంబ సభ్యులతో శనివారం గోదావరిఖని సమీపంలోని సుందిళ్ల ఆలయానికి శనివారం దర్శణానికి వెళ్లి అక్కడే బస చేశారు. ఆదివారం ఉదయం ఏడు గంటల సమయంలో ఇంటికి వచ్చారు. తాళం పగలగొట్టి ఉండడంతో ఇంట్లో వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉండి అందులో సామాన్లు చిందరవందరగా పడేసి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ బాలాజీ వరప్రసాద్‌ను సంప్రదించగా బీరువాలో ఉన్న 20 తులాల బంగారం చోరీకి గురయ్యైనట్లు తెలిపారు. సంఘటన స్థలంలోకి ఎస్సై ఉదయ్ కిరణ్ వచ్చి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోసిని డ్యాంలో విద్యార్థి గల్లంతు

కాగజ్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ కోసిని డ్యాంలో ఆదివారం సాయంత్రం ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. పట్టణానికి చెందిన ముగ్గురు విద్యార్థులు కోసిని డ్యాంలో స్నానం చేసేందుకు వెళ్లారు. బాలాజీనగర్‌కు చెందిన అంకిత్ రాథోడ్ ఈత రాక గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సందీప్ అక్కడికి చేరుకొని గత ఈతగాళ్లతో గాలింపు చేపడుతున్నారు. అంకిత్ రాథోడ్ స్థానిక సెయింట్ క్లారెట్ పాఠశాలలో పదో తరగతి చదువతున్నారు.

మండల కార్యవర్గం

చింతలమానేపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో ఆదివారం సీఐటీయూ అను బంధ గ్రామ పంచాయతీ యూనియన్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నా రు. అధ్యక్షుడిగా విలాస్, కార్యదర్శిగా సంజీవ్, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, రవి, సహయ కార్యదర్శులుగా తిరుపతి, గణేష్, సభ్యులుగా జానయ్య, విలాస్, విలాస్, గణేశ్ ఎన్నికయ్యారు.

కుల వివక్షపై అట్రాసిటీ కమిటీ విచారణ

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులవాడ గ్రామ పంచాయతీ పరిధిలో గల కొమ్ముగూడలో గ్రామస్థులు తమను కులంపేరుతో ఇబ్బందులు పెడుతున్నారని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో అట్రాసిటి కమిటీ సభ్యులు ఆదివారం గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు రేగుంట కేశవ్ మాట్లాడుతూ ప్రస్తుత సీఐ గ్రామం లో వచ్చిన పొరపొచ్చాలని తొలగించే ప్రయత్నం చేసినప్పటికీ అవి అలాగే కొనసాగుతున్నాయన్నారు. కంప్యూటర్ యుగంలో అంటరానితనం అంటూ కొంత మంది మాట్లాడడం విడ్డూరంగా ఉంద న్నారు. దేవుణ్ణి పూజించుకునే హక్కు అందరికి ఉందని ఎవరిన్న కూడా కట్టడి చేసే అధికారం ఎవరికి లేదన్నారు. గ్రామంలో అటువంటి సంఘటన చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. గ్రామంలో జరిగిన సంఘటనను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాఆధితులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ప్రజలు కుల వివక్షకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మల్లేష్, శంకర్, వెంకటేష్, రమేష్, రాజయ్య, వెంకటేష్, వెంకటి, సంతోష్, సురేష్, రవి, మహేష్, అశోక్, శేఖర్, లక్ష్మి, వైశాలి, కమల తదితరులు పాల్గొన్నారు.



లాభాల వాటా ప్రకటించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి రాజేందర్

మందమర్రిటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో 2024-25 ఆర్థిక సంవత్సరాని కి సంబంధించిన లాభాల వాటాను వెంటనే ప్రకటించి 35 శాతం చెల్లించాలని సీఐటీయూ బ్రాంచ్‌కార్యదర్శి అల్లి రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. ఆర్థిక సంవత్సరముగిసి ఐదు నెలలు కావస్తున్నా లాభాల వాటా ఇప్పించడంలో విఫలమయ్యారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడేది సీఐటీయూ మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యం

శ్రీరాంపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు రక్షణ కల్పించడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. కాలం చెల్లిన యంత్రాలు, అరకొర రక్షణ పరికరాలను అందించడం, పనిస్థలాల్లో సరైన ఏర్పాట్లు చేయకపోవడం వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా యన్నారు. ఇప్పటికైనా రక్షణ చర్యలు తీసుకుంటూ నూతన యంత్రాలు కొనుగోలు చేయాలని, వైద్య పరికరాలు అమర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కస్తూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గనుల్లో భద్రత పెంపునకు చర్యలు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

శ్రీరాంపూర్/రామకృష్ణాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గనుల్లో భద్రత పెంపునకు పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకుం టామని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. డీజీఎంఎస్(రక్షణ) ఉజ్వల్ థా అధ్యక్షతన క్యాతన్‌పల్లిలో ని ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన 49వ రక్షణ త్రైపాక్షిక సమీక్ష సమావేశంలో డీజీఎంఎస్ అధికారులు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు, సింగరేణి అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సింగరేణి ఉత్పత్తితో పాటు రక్షణలో సైతం ఆదర్శ ప్రాయంగా ఉందని పేర్కొన్నారు. ప్రతి కార్మికుడి ప్రాణాలు ఎంతో విలువైనవని, వాటిని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. చాలా ప్రమాదాల్లో నిర్లక్ష్యం, నిర్లప్తతతో ప్రాణనష్టం జరుగుతోందని, రక్షణ లేని ప్రదేశాల్లో పనిచేయాలని యాజమాన్యం ఎప్పుడూ ఒత్తి డి చేయబోదని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వీయరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రక్షణకు అవసరమైన వసతులను సంస్థ సమకూరుస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, ఇతర నాయకులు మాట్లాడుతూ కార్మికుల రక్షణకు నాణ్యమైన హెల్మెట్లు, బూట్లు సరఫరా చేయాలని, వైద్య సేవలు, క్యాంటీన్లలో వసతులు, కొత్త యంత్రాల కొనుగోలు, ఆధునీకీరణ, అవసరమైన సిబ్బంది నియామకం చేపట్టాలని సూచించారు. అనంతరం డీజీఎంఎస్ (రక్షణ) ఉజ్వల్ థా, డీడీఎంఎస్ అధికారులు, సింగంణి డైరెక్టర్లు సత్యనారాయణ, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, గౌతం పొట్రు రక్షణ చర్యలపై ప్రసంగించారు. ముందుగా పలు ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికులకు సంతాపం ప్రకటించారు. కార్పొరేట్ జీఎం(రక్షణ) చింతల శ్రీనివాస్ రక్షణ నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా అధి కారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీడీఎంఎస్ హైదరాబాద్ టి ఆర్‌కన్నన్, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ పోరాటం వల్లే మేలు

శ్రీరాంపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఎంఎస్ ఆధ్వర్యంలో జూలై 23 నుంచి చేపట్టిన పోరాటాల ఫలితంగా కోల్ ఇండియా యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులు అనేక హక్కులు కల్పించేందుకు నిర్ణయించినట్లు ఆ సంఘం బొగ్గు గనుల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31న జరిగిన 481వ కోల్ ఇండియా బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో, చట్టబద్ధమైన హక్కులతో పాటు ఇతర ప్రయోజనాలు కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సింగరేణిలో సైతం అమలు చేయాలని ఏబీకేఎంఎస్ (బీఎంఎస్) ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

గిరిజన ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

మందమర్రిటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గిరిజన ఉద్యోగుల సమస్యల సాధనతో పాటు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు దారావత్ పంతులా నాయక్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా సంఘం పటిష్టతే లక్ష్యంగా ముందుకు సాగాలని ప్రతి ఒక్కరు పాటుపడాలని పేర్కొన్నారు. గిరిజన ఉద్యోగులకు సంబంధించిన ఏమైన సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకరావాలని తెలిపారు. రానున్న రోజుల్లో సింగరేణిలో గిరిజన ఉద్యోగులకు సంబంధించి పెద్ద ఎత్తున ఓ సభ కూడ ఏర్పాటు చేసేందుకు దృష్టిసారించామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఏరియా కమిటీ ఎన్నిక

సింగరేణి గిరిజన సంక్షేమ సంఘం 7865-2021 సంఘం మందమర్రి ఏరియా నూతన కమిటీని ఆదివారం ఇలందు క్లబ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మందమర్రి ఏరియా అధ్యక్షుడిగా సివిల్ ఇంజనీర్ బానోత్ రాము నాయక్, గౌరవ అధ్యక్షులుగా వాంకుడోత్ దూప్‌సింగ్, ఉపాధ్యక్షులు గుగు లోత్ రాంబాబు, రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా దరావత్ తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అశోక్, ప్రచార కార్యదర్శిగా బుక్య ప్రవీణ్, కోశాధికారిగా బాలక్రిష్ణ, సంయుక్త ప్రధాన కార్యదర్శిగా భుక్య రవిలను ఎన్నుకున్నారు. అదే విధంగా గనుల డిపార్ట్‌మెంట్లకు సంబంధించి కూడ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

కనుమరుగవుతున్న సంచార జాతుల కళలు

» ప్రధాని మోదీ ఆదేశాలతో విముక్తి దినోత్సవం: కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విన్యాసాలు, హరి కథలు, బుర్ర కథలు వంటి సంప్రదాయ కళలు అంతరించిపోవడం దురదృష్టకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రధాన మోదీ సంచార జాతుల విముక్తి దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా ఈ వేడుకను జరపాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను 1999లో మొదటిసారి శాసన సభ్యుడిగా ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో సంచార జాతుల సమస్యలను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాతే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంఘాలతో మాట్లాడి కులాల పేర్లను అధికారికంగా మార్చారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కుల గణన ఓటు బ్యాంకు దృష్టితో జరిగిందని, అందులో బీసీలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. కులాల వారీ లెక్కలు అధికారికంగా రావాలంటే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే గణన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సంచార జాతుల్లో కులాల లెక్కలు అధికారికంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలను స్పష్టంగా అమలు చేయవచ్చని లక్ష్మణ్ అన్నారు.

వివరణ ఇచ్చేందుకు 10 రోజుల గడువు ఇవ్వండి

» స్పీకర్‌ను కలిసి కోరిన కడియం, అరికెపూడి, దానం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు మేరకు జారీ చేసిన నోటీసులపై విచారణకు హాజరై వివరణ ఇచ్చేందుకు తమకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్ కోరారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలూ స్పీకర్‌ను కలిసి గడువు కోరనున్నట్లు తెలుస్తోంది. అనంతరం అసెంబ్లీ లాబీల్లో కడియం, అరికెపూడి గాంధీ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తాము వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కాగా.. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చిన బీఆర్ఎస్.. ఈ అంశంపైన సుప్రీం కోర్టునూ ఆశ్రయించగా.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే పది మంది ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

ఆర్ఎఫ్‌సీఎల్ లో లీకేజీలకు ఎవరిది బాధ్యత..?

» రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో అమ్మోనియా పైప్‌లైన్ వరుస లీకేజీలకు బాధ్యత ఎవరిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రశ్నించారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే రాష్ట్ర రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని యూపీఏ ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణానికి అనుమతినిచ్చిందని తెలిపారు. ప్లాంటు అవసరాలకు మిషన్ భగీరథ నీరు ఇస్తున్నామని, ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్లో రాష్ట్రానికి రావాల్సిన 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్లాంట్‌లో నిర్మాణలోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.

కేటీఆర్.. ఓ మానసిక రోగి

ఉపరాష్ట్రపతి ఎన్నికకు యూరియాకు ఏం సంబంధం?.. ఎన్డీఏ అభ్యర్థికే ఓటేస్తామని చెప్పొచ్చుగా?

- » నాపై 181 కేసులు బనాయించారు
- » ఇల్లు కూల్చేశారు..నన్ను కిడ్నాప్ చేశారు
- » చంద్రబాబుతో సంప్రదింపులు అబద్ధం
- » 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని
- » 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక మానసిక రోగి అని, యూరియా ఇస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామనడం పిచ్చికి పరాకాష్ట అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనవసరంగా ఇలాంటి నాటకాలు ఎందుకని, ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తామని కేటీఆర్ చెప్పవచ్చు కదాని పేర్కొన్నారు. యూరియా ఇచ్చేది కేంద్రమని, అలాంటప్పుడు యూరియా ఇస్తేనే ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఎలా అంటున్నారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమంగా 181 కేసులు బనాయించారని, ఆ కేసులే తనకు మెడల్స్ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్.. ఇలా అనేక రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ఎంపీలు ఉన్నారని, వారంతా కలసి సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌ను ఇండియా టుడే ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. అందులో రేవంత్ ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పతనావస్థకు చేరింది..

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవ దానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించిందని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఒక్క పార్లమెంట్ సీటైనా గెలిచిందని, ఇప్పు డు ఘోరంగా పతనావస్థకు చేరిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లోనూ బీజేపీనే గెలిచిందన్నారు.

కేసులతో ఖతం చేయాలని చూశారు..

ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిసారి తనపై కేసులు పెట్టారని, అలా కేసులు పెట్టిన ప్రతిసారీ తనకు ప్రజల్లో మద్దతు పెరిగిందని రేవంత్ చెప్పారు. "నాపై 181 అక్రమ కేసులు పెట్టారు. ఎప్పటికైనా తన ప్రత్యర్థిని నేనేనని కేసీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను హింసించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నాపై క్రిమినల్ కేసులు పెట్టి ఖతం చేయాలని చూశారు. ఎన్నికల సమయంలో నా ఇల్లు కూల్చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. మూడు నెలలకే ఎంపీగా గెలిచి ఢిల్లీకి వచ్చా. ఈ రోజు సీఎం అయ్యా" అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ బిల్లు..

ఏదైనా కేసులో అరెస్టయి 30 రోజులకుపైగా జైలులో ఉన్న సీఎంలు, మంత్రులను పదవి నుంచి తప్పించే బిల్లును రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే దానిని తీసుకువచ్చారని ఆరోపించారు. "ప్రస్తుతం విపక్ష సీఎంలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం చూస్తున్నాం. చిన్న అంశాల్లోనూ 30 రోజులు జైల్లో పెట్టొచ్చు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. కొత్త బిల్లు చట్టంగా మారాక ఢిల్లీ ఆదేశాలను అమలు చేయకపోతే.. రాష్ట్రాల సీఎంలు ఎవరైనా పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై యోగి ఆదిత్యనాథ్ సహా బీజేపీ సీఎంలే ఆందోళన చెందుతుంటే.. మిగతా సీఎంల పరిస్థితి ఏమిటి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగని తానేమీ భయపడటం లేదని, తానెలాంటి తప్పూ చేయలేదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి మద్దతివ్వకపోతే ఖతం చేయడమే వాళ్లకు తెలుసని ఆరోపించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు.

చంద్రబాబుతో సంప్రదింపులు అవాస్తవం

2024లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో చంద్రబాబుతో తాను సంప్రదింపులు జరిపాననేది అవాస్తవ ప్రచారమని రేవంత్ స్పష్టం చేశారు. తానెప్పుడూ అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అలాంటి రాజకీయాలను రాహుల్ గాంధీ విశ్వసించరని.. ఆయన అలా అనుకుంటే ఎప్పుడో ప్రధాని అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు సీనియర్ రాజకీయవేత్త అని, రాజకీయ ఎత్తుగడల్లో ఆయనకు మించిన వారెవరూ లేరని పేర్కొన్నారు. చంద్రబాబును తాను గౌరవిస్తానని, కానీ తనకు పార్టీ, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. తన రాజకీయ అంచనాలు ఎప్పుడూ తప్పలేదని.. 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని అని, కావాలంటే రాసిపెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీకి 2029 ఎక్స్‌పైరీ తేదీ అన్నారు. తాను బీజేపీలో పనిచేయలేదని, ఏబీవీపీలో పనిచేశానని.. బీజేపీ రాజకీయ పార్టీ అని, ఏబీవీపీ విద్యార్థి సంఘమని వివరించారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ యూనివర్సిటీలో ఉన్నానని చెప్పారు.

ముందు ప్రేమించా..
సినిమా స్టైల్లో పెళ్లి జరిగింది..

తన ప్రేమ, వివాహంపై రేవంత్ ఆసక్తికర విషయాలు తెలిపారు. "నాది పెద్దలు చేసిన ప్రేమ వివాహం. ముందు నేను ప్రేమించాను. తర్వాత అది అరేంజ్ మ్యారేజ్‌గా మారింది. నా భార్య గీత ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో చదువుకుంది. నేను తెలంగాణలో ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. మా పరిచయం ఊహించని విధంగా జరిగింది. విజయవాడలో వాజ్‌పేయి సభ జరిగింది. కొందరితో కలసి నేను హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాను. తిరిగి వచ్చే క్రమంలో గీత కుటుంబంతో కలిసి నాగార్జున సాగర్‌లో ఆగాం. అక్కడ గీతతో పరిచయం జరిగింది. అది ప్రేమగా మారింది. చివరికి సినిమా స్టైల్‌లో మా పెళ్లి జరిగింది. టైం దొరికితే మనవడితో ఎంజాయ్ చేస్తా" అని చెప్పారు.

ఒక్కసారి కూడా సిగరెట్ తాగలే..

జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తాను సిగరెట్ తాగలేదని, అది తన విల్ పవర్ అని రేవంత్ చెప్పారు. తాను టీ కూడా తాగేవాడిని కాదని.. విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో అలవాటైందని తెలిపారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, రాహుల్ గాంధీ దగ్గర సమయం దొరికినప్పుడల్లా.. ఫిట్‌నెస్‌పై సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

ఓటుహక్కును కొల్లగొడుతున్న మోదీ

18 ఏళ్లకు ఓటుహక్కు కల్పించిన రాజీవ్‌గాంధీ.. దానిని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడదాం

- » 2029 రాహుల్ ప్రధాని అయ్యే సంవత్సరంగా చాటుదాం
- » 21 ఏళ్లకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలి : రేవంత్‌రెడ్డి
- » కేరళలో పాంథువల్ మెరిట్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు



విద్యార్థినికి పాంథువల్ మెరిట్ అవార్డు అందజేస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశంలో 18ఏళ్ల నిండిన ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పౌరుల నుంచి ఓటుహక్కును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన వారికి, ఓటు హక్కును కొల్లగొట్టిన వారికి మధ్యే 2029 ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. 2029ని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే సంవత్సరంగా చాటుదామన్నారు. ఆదివారం కేరళలోని అలప్పుళలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన పాంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన ఈ అవార్డులు పది, పన్నెండు తరగతుల్లోని విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని, పేదలకు నాణ్యమైన విద్యనందించాలని సంకల్పించామని తెలిపారు. 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రంలో యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 21ఏళ్లకు తగ్గిస్తూ రాజ్యాంగాన్ని సవరించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కేవలం యువత శక్తిని నమ్ముకుని పోరాటం సాగిస్తోందన్నారు.

ఆగస్టులో రికార్డు వానలు

» సాధారణం కంటే 75% అధిక వర్షపాతం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టులో సాధారణం కంటే 75శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 21.5సెం.మీ పడాల్సి ఉండగా.. 37.85 సెం.మీ కురిసింది. అంటే రోజుకు సగటున 1.2 సెం.మీ. వాన పడింది. గత ఏడాదితో సగటు పోల్చితే ఈసారి 80శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాగా, ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 57.3సెం.మీ నమోదు కావాలి. అయితే ఇప్పటి వరకు 72 సెం.మీ వర్షం కురిసింది. అంటే 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 621 మండలాలుండగా.. 136 చోట్ల అత్యధిక (60% ఎక్కువగా), 238 చోట్ల అధిక (20-59శాతం మధ్య), 221 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో 26 మండలాల్లో 20-60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 104 సెం.మీ పడింది. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

ఓరియంట్ ఎన్నికల్లో ఓటమిపై పోస్టుమార్టం

కాసిపేట, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండువర్గాల పరువు ప్రతిష్ఠల మధ్య జరిగిన ఓరియంట్ ఎన్నికల మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు వర్గం మంత్రి వివేక్ అండ్ కో వర్గంపై పైచేయి సాధించింది. ఓరియంట్ కార్మికులతో పాటు జిల్లా నాయకులతో ఎన్నికల ఓటమిపై పోస్టుమార్టం నిర్వహించారు. ఓటమికి గల కారణాలు కార్మికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సమస్యలను అంచనా వేయడంలో నాయకులు వైఫల్యం చెందారు. మంత్రి అనుచరులు స్థానిక కార్మిక నాయకులను పూర్తిగా నమ్మకుండా నేరుగా కార్మికులతోనే మాట్లాడి డీల్ సెట్ చేసుకోవడంతో స్థానికంగా ఉన్న కార్మిక నేతలు కొంత అసంతృప్తికి గురయ్యారనే ప్రచారం జరుగుతుంది.

యూరియా బస్తాలు స్వాధీనం

భీమిని, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడాల గ్రామ శివారులో వాహనంలో అక్రమంగ వాహనంలో తరలిస్తున్న 20 యూరియా బస్తాలను ఆదివారం వ్యవసాయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వడాల గ్రామ శివా రులో జగ్గయ్యపేటకు చెందిన బాలాజీ ట్రేడర్స్‌కు చెందిన బోనగిరి సతీష్‌కు చెందిన 20 బస్తాలను ఎక్కువ ధరలకు అమ్ముతున్నారనే సమాచారంతో మండల వ్యవసాయ అధికారి యమునా దుర్గ అక్కడి చేరుకుని స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించి ఫర్టిలేజర్ యజమానిపై ఫిర్యాదు చేశారు. యూరియా బస్తాలతో పాటూ వాహనం ఏపీ 22 వై 9194 వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

కోటపల్లి ఎస్ఐకి రివార్డు

కోటపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు ఎస్‌బీఐ బ్రాంచ్‌లో జరిగిన నగదు అవకతవకల కేసును ఛేదించడంలో చాక చక్యంగా వ్యవహరించి నగదు రికవరీలో కీలకంగా వ్యవహరించిన కోటపల్లి ఎస్ఐ రాజేందర్‌ను ఆదివారం రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు. ప్రత్యేకంగా ఎస్ఐ రాజేందర్‌కు రివార్డు అందించారు.

సత్యపాల్‌రావు విజయోత్సవ ర్యాలీ

కాసిపేట, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో సత్యపాల్‌రావు ఘన విజయం సాధించారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం దేవాపూర్, పెద్దాపూర్, అచ్యుత్‌రావుగూడెం, రాంపూర్, మద్దిమాడ గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయ వృత్తి విలువైనది

లక్సెట్టిపేట, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పాత్రికేయ వృత్తి చాలా విలువైనదని ప్రముఖ సామాజిక వెత్త రోడ్డు బద్రత సలహా దారు డాక్టర్ నీలం సంపత్ అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమాజంలో మీడయా పాత్ర కీలకం అనే అంశంపై జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా మీడియా ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా శాలువా పూల మాలలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బొనగిరి కుమారస్వామి, ప్రధానకార్యదర్శి చెరుకు వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శి చీకటి తిరుపతి, కోశాధికారి సందీప్‌తో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జన్నారం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా నేరెల్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాపాలైన మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన దుమ్మల్ల రాజు కుమార్(26)అనే యువకుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. సుమారు 75రోజుల పాటు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి తండ్రి లింగన్న, తల్లి అమృతతో పాటు తమ్ముడు ఉన్నారు.

జీరో ప్రమాదాలు లక్ష్యంగా పనిచేయాలి

- ఖనిజాలు, గనులు లేకపోతే అభివృద్ధి లేదు
- డీజీఎంఎస్(రక్షణ) ఉజ్వల్ థా
- ఉత్పత్తి కంటే ఉద్యోగులే ముఖ్యం
- సింగరేణి సీఎండీ ఎన్. బలరాం

శ్రీరాంపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం సింగరేణిలో ప్రమాదాల రేటు చాలా తక్కువగా ఉందని, కానీ జీరో ప్రమాదాలు లక్ష్యంగా పనిచేయాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉజ్వల్ థా అన్నారు. క్యాతన్‌పల్లిలోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఖనిజాలు, గనులు ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని, ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా టెక్నాలజీ తెలిసిన ఉద్యోగుల అవసరం ఉందన్నారు. మహిళా ఉద్యోగులు కంపెనీలో చాలా మంది ఉన్నారని, వారి శాతం మరింత పెరగ నుందన్నారు. పని ప్రదేశాల్లో నిరంతరం అప్రమత్తతో ఉండాలన్నారు. ప్రతీ కార్మికుడికి రక్షణ,వైద్యం, సంక్షే మం అమలు చేయాలని సూచించారు. అనంతరం సీఎండీ బలరాం మాట్లాడుతూ, కొత్త గనులు లేకపోతే సంస్థ భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందని, అందువల్లే వేలంలో పాల్గొంటున్నామని తెలిపారు. రక్షణ మన సంస్కృతిగా మారితే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. అధికారులకు 10, 15రోజుల్లో పీఆర్‌పీ ఇస్తామని, కార్మికులకు ఎప్పటిలాగే దసరా, దీపావళికి అందించే బోనస్‌లు ఇస్తామని చెప్పారు. గతంలో సింగరేణి అంటే కేవలం తెలంగాణ అనే వారని, కానీ ఇప్పుడు ఒడిషా, రాజస్థాన్, కర్ణాటక, తదితర రాష్ట్రాల్లో విస్తరించామన్నారు. భవిష్యత్తులో ఆస్ట్రేలియా, ఆఫ్రికా దేశాల్లో పని ప్రారంభించి విశ్వవ్యాప్తం అవుతామని వివరించారు. ఏఐటీ యూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య మాట్లాడుతూ, జీరో యాక్సి డెంట్స్‌తో ముందుకు పోవాలని అన్నారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జన రల్ బి. జనక్ ప్రసాద్ మాటాడుతూ, వేలంలో పాల్గొని అనేక గనులు దక్కించుకోవాలన్నారు. అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ మాటాడుతూ, రక్షణ ముందు, ఉత్పత్తి తర్వాత అనే స్లోగన్‌ను తప్పక పాటించాలన్నారు. శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్ స్వాగతోపన్యాసం చేయగా, కార్పొరేట్ జీఎం(రక్షణ) చింతల శ్రీనివాస్, డీడీఎంఎస్ (రక్షణ) కణ్ణన్, తదితరులు మాట్లాడారు. అనంతరం డైరెక్టర్ (ఈఎం) సత్యనారాయణ, ఈడీ (కోల్‌మూమెంట్) సుభాని రిటైర్ అవుతున్న సంద ర్భంగా వారిని సన్మానించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సత్య నారాయణ, సూర్య నారాయణ, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కు మార్, ఈడీ(కోల్‌మూమెంట్) వెంకన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సావనీర్ విడుదల చేస్తున్న అతిథులు

కార్యవర్గం ఎన్నిక

మంచిర్యాలక్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నికలు ఆది వారం కోర్టు ప్రాంగణంలో హోరాహో రీగా జరిగాయి. ఎన్నికల కమిషనర్ ఎండీ ఇంతీ యాజ్, అసిస్టెంట్ ఎన్నికల కమిషనర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా న్యాయ శాఖ ఉద్యోగులు 164 మంది ఉండగా 157 మంది తమ ఓటు హక్కును విని యోగించు కున్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా అగ్గర్సు రాజగోపాల్, ఉపాధ్యక్షుడిగా ఎం. రజనికాంత్రావు, ఎం. మనోహర్, సీహెచ్. మాదవి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రసిడెంట్‌గా ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జెనరల్ సెక్రటరీగా మంజుల, ఆర్గనైజింగ్ సెక్రటరిగా ఎన్. శ్రీనివాస్, జాయింట్ సెక్రటరిగా జీ. చిన్నయ్య, కే. నుగుణా కర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సంక్షిప్త సమాచారం

పరిహారం అందజేత

నెన్నెల : కన్నెపల్లి మండలం సుర్జాపూర్ వద్ద ఈ నెల 16న అడవిపంది దాడిలో మృతి చెందిన వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు దాగామ రామయ్య కుటుంబానికి ఆదివారం పరిహారం అందజేశామని కుశ్నపల్లి రేంజీ అధికారి దయాకర్ తెలిపారు. రూ. 10 లక్షలు మృతుడి భార్య ఖాతాలో జమ చేశామని చెప్పారు. నష్టపో యిన వారు తగిన ధృవీకరణ పత్రాలతో మీసేవాలో దరఖాస్తు చేసుకోవాలని ఏఫ్ ఆర్‌వో సూచించారు.

సింగరేణి డైరెక్టర్‌కు సన్మానం

జైపూర్ : సింగరేణి సంస్థ 139 ఏండ్ల చరిత్రలో తొలిసారి గిరిజన వర్గానికి డైరెక్టర్ హోదా లభించింది. జైపూర్ ఎస్టీపీపీ కాన్ఫరెన్స్ హాలులో డైరెక్టర్ ఈఅండ్ఎంగా నియమితులైన తిరుమల్‌రావును ఆదివారం ఎస్టీపీపీ ఈడీ చెన్నకేశవుల చిరంజీవి, జీఎం శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. ఎస్సీ అసోసియేషన్ చీఫ్ లైజనింగ్ అధికారి రాంచందర్, ఎస్టీ లైజనింగ్ అధికారి కృష్ణయ్య, అధ్యక్షుడు ధరవత్ పంతుల పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్ బైక్ ర్యాలీ

జైపూర్ : హెచ్‌ఎంఎస్ యూనియన్ రాష్ట్రస్థాయి 26వ మహాసభ సందర్భంగా ఎస్టీపీపీ హెచ్‌ఎంఎస్ నాయకులు, కార్మికులు ఆదివారం ప్లాంట్ గేటు ముందు నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకులు విక్రమ్‌కుమార్, సాయికృష్ణరెడ్డి, సంపత్‌లు మాట్లాడుతూ ఎస్టీపీపీ కార్మికుల ఐక్యత, సంఘీభావం హెచ్‌ఎంఎస్ ఉద్యమానికి బలం అవుతుందన్నారు.

నష్టపరిహారం అందజేత

కన్నెపల్లి : మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన దాగామ రామయ్య ఆగస్టు 16న అడవి పంది దాడిలో మృతిచెందగా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం మంజూరైనట్లు ఎఫ్ఆర్‌వో దయాకర్ ఆదివారం తెలిపారు. నష్టపరిహారం రూ. 10 లక్షలను కుటుంబీకులకు ఆన్‌లైన్ ద్వారా బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు.

ఉద్యోగికి పదవి విరమణ తప్పదు

హాజీపూర్: ప్రతి ఉద్యోగికి సమయం వచ్చినప్పుడు పదవి విరమణ తప్పదని 13వ బెటాలియన్ కమాండెంట్ వెంకట రాములు అన్నారు. బెటాలియన్‌లో హెడ్ కుక్‌గా పని చేసిన మల్లయ్య రిటర్మెంట్ సభకు కమాండెంట్‌తో పాటు బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు. కుక్ మల్లయ్య దంపతులను పూలదండలు, శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

జన్నారం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అందించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ మండల అధ్యక్షులు గూడ అశోక్ మాట్లాడుతూ అఖిలభారత బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. క్రిష్ణయ్య హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో యుద్ధబేరి సభ నిర్వహిస్తున్న సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశామన్నారు. నరేంద్రమోడి బీసీ కులాలకు స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, చట్టసభల్లో 50శాతం 9వ షెడ్యూల్‌లో చేర్చి రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం ఉద్యమ పోరాట సంఘం నాయకులు నర్సయ్య, లక్ష్మీనారాయణ, కోడూరి చంద్రయ్య, గోపాల్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎంసీహెచ్ రోగుల అరిగోస..

(5వ పేజీ తరువాయి)

అత్యంత ఖరీదైన మందులు అందులోనే ఉండిపోయాయి. అవన్నీ వరదలో మునిగిపోగా తిరిగి పనికిరాకుండా పోయాయి. వరద నీటిలో కొట్టు కొచ్చిన వందలకొద్ది విష సర్పాలు భవనంలో తిష్టవేశాయి. వరదల అనంతరం భవనాన్ని శుభ్రపరిచేందుకు లోనికి వెళ్లిన ఓ మహిళను పాము కాటువేయగా, అదృష్టవశాత్తు బతికి బయటపడింది. ఇక అప్పటి నుంచి ప్రతియేటా వర్షాకాలంలో ఆస్పత్రి భవనం ముంపునకు గురవుతుండగా, రోగులను ముందస్తుగా తరలించడం అలవాటుగా మారింది. ఇదిలా ఉండగా ఆసుపత్రి స్థలం మొదట కలెక్టరేట్ సముదాయం నిర్మాణానికి కేటాయించారు. సదరు స్థలం శాశ్వత భవన నిర్మా ణా లకు పనికిరాదని అప్పటి ఆర్అండ్‌బీ అధికారులు నిర్ధా రించారు. కలెక్టరేట్‌ను మరో చోటుకు తరలించిన అధికారులు ఎంసీహెచ్‌ను మాత్రం అదే స్థలంలో నిర్మిం చడం కొసమెరుపు.

చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రులకు....

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఎల్లంపల్లి గేట్లు ఎత్తడంతో ఈ నెల 28న హుటాహుటిన ఎంసీహెచ్‌ను మళ్లీ ఖాళీ చేయాల్సి వచ్చింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) తో పాటు జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి, చికిత్స అందిస్తున్నారు. అత్యవ సర సమయాల్లో ఆపరేషన్లు అవసరం ఉన్న వారిని మాత్రం జీజీహెచ్‌లో ఉంచారు. జీజీహెచ్‌తోపాటు ఇతర ప్రైవేటు నర్సింగ్ హోంలలో చికిత్సకు ప్రభుత్వ వైద్యులు, సిబ్బందిని షిఫ్టుల వారీగా తరలిస్తూ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అయినప్పటికీ గర్భిణులు, బాలింతలు, శిశువులకు వివిధ ఏరియాల్లో ఉన్న వేర్వేరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తుండగా కుటుంబ సభ్యులు, రోగులు నగర నలుమూలలా తిరగాల్సి వస్తోంది. దీంతో ఒకరికొకరు అందుబాటులో ఉండే అవకాశంలేక వారంతా మనోవేదనకు గురవుతున్నారు. వేర్వేరు చోట్ల, అరకొర సౌకర్యాల నడుమ చికిత్స పొందాల్సిన దుస్థితి రోగులకు ఏర్పడుతోంది. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ప్రత్యేక చొరవతో రూ. 350 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ అతిథిగృహ ఆవరణలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణం పూర్తయితే తప్ప. ఒకేచోట రోగులకు చికిత్స అందే అవకాశాలు కానరావడం లేదు.

ఎల్లంపల్లికి తగ్గిన వరద ఉధృతి

హాజీపూర్, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. శనివారం వరకు 7లక్షల క్యూసెక్కుల వరదనీరు రావడంతో అధికారులు 40గేట్లుఎత్తి దిగువ గోదావరికి నీటిని వదిలారు. ప్రస్తుతం వరదఉధృతి తగ్గడంతో 19 గేట్లను మూసివేసి 21గేట్లతో వచ్చే నీటి ప్రవాహాన్ని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి శ్రీరాంసాగర్ ప్రాజెక్టునుంచి 3లక్షల 25 వేల క్యూసెక్కులు, వరద రూపంలో 3 లక్షల12వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. మొత్తంగా 3లక్షల 56 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రూపంలో వస్తుండగా గేట్ల ద్వారా 3లక్షల 21వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టుపూర్తి నీటి సామర్థ్యం 20.175టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.29టీఎంసీల నీరు ప్రాజెక్టులో నిల్వ ఉంది.


మన్‌కీ బాత్ వీక్షణ

చెన్నూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కిష్టంపేట గ్రామంలోని 150వ బూత్‌లో ఆదివారం ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, వెంకటేష్, మల్లారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కమిటీలతో మాల సంఘం బలోపేతం

శ్రీరాంపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఏరియాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేస్తామని ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. నర్సింగ్ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ఎయిమ్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సాయినగర్‌కు చెందిన మామిడి నాగరాజును జిల్లా ప్రధాన కార్యదర్శిగా, వాటర్ ట్యాంక్ ఏరియాకు చెందిన కాల్వ సురేష్‌ను నియోజకవర్గ ప్రధాన కార్య దర్శిగా ఎన్నుకున్నారు. నర్సింగ్ వారికి కండువాలు కప్పి నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, యూత్ జిల్లా అధ్యక్షుడు బింగి సదానందం, నాయకులు సారయ్య, రవి పాల్గొన్నారు.

ఎంసీహెచ్ రోగుల అరిగోస..


నీట మునిగిన ఎంసీహెచ్ భవనం (ఫైల్)


ఆస్పత్రి నుంచి ఇటీవల పేషెంట్లను తరలిస్తున్న వైద్య సిబ్బంది

- ప్రతీసారీ వరదల్లో మునుగుతున్న ఆస్పత్రి
- భవనం ఖాళీ చేయడంతో బాలింతలు, గర్భిణుల అవస్థలు
- ప్రభుత్వ దవాఖానా నుంచి ప్రైవేటు ఆసుపత్రులకు
- చికిత్స కోసం నలుమూలలు తిరుగుతున్న వైనం
- తల్లులు, పిల్లలకు వేర్వేరు చోట్ల చికిత్సతో ఇబ్బందులు
- ప్రతియేటా ఇదే తంతు..

మంచిర్యాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆనాలోచిత నిర్ణయాలతో గోదావరి సమీపంలో నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) వల్ల ప్రతియేటా ఇబ్బందులు కలుగుతూనే ఉన్నాయి. మంచిర్యాల నగర సమీపంలో ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు తెరిచినప్పుడల్లా ఆస్పత్రి భవనం నీట మునుగుతోంది. దీంతో అందులో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలు, శిశువులకు ఎనలేని కష్టాలు ఏర్పడుతున్నాయి. లూజ్ సాయిల్ కారణంగా శాశ్వత కట్టడాలకు స్థలం పనికి రాదని తెలిసినా. ఎంసీహెచ్ భవనాన్ని అక్కడే నిర్మించడంలో అధికారులు క్షమించరాని తప్పిదానికి పాల్పడ్డారనే అపవాదులు మూటగట్టుకోవాల్సి వస్తోంది. గతంలో ఎంసీహెచ్ ప్రస్తుత ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ఉండేది. 30 పడకలతో గర్భిణులు, శిశువులు, బాలింతలకు చికిత్స లభించేది. అయితే మహిళల సంఖ్యకు సరిపడా సౌకర్యాలు లేకపోవడంతో కొత్త భవనం నిర్మించాలనే తలంపునకు అధికారులు వచ్చారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖకు ప్రతిపాదనలు పంపగా 2017-12-22న నేషనల్ హెల్త్ స్కీంలో భాగంగా 100 పడకలతో కూడిన నూతన ఆస్పత్రి మంజూరైంది. ఆస్పత్రికి అనువైన స్థలం కేటాయించాలని అప్పటి కలెక్టర్ కర్ణన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మొదట జిల్లా ఆస్పత్రి సమీంలోని ఓ ప్రైవేటు భవనాన్ని ఎంసీహెచ్ కోసం ప్రతిపాదించినా చివరకు వివిధ కారణాల వల్ల దాన్ని రద్దు చేశారు. దీంతో స్థానిక ప్రభుత్వ అతిథి గృహ ఆవరణలో (ప్రస్తుత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ స్థలం) ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం కారణాలు ఏమైనా చివరకు గోదావరి నది సమీపంలోని భూదాన్ బోర్డుకు చెందిన స్థలంలో భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.

రూ. 17 కోట్లతో భవనం నిర్మాణం...

ఎంసీహెచ్ భవనం కోసం స్థలం ఎంపిక చేయడంతో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ. 17 కోట్లతో (ప్రస్తుతం భవనం ఉన్నచోట) నిర్మాణం చేపట్టారు. 2018లో ప్రారంభమైన పనులు నాలుగేళ్ల అనంతరం పూర్తికాగా 2022 మార్చి 4న అప్పటి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో అప్పటిదాకా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో కొనసాగుతున్న మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని అదే సంవత్సరం మేలో నూతన భవనంలోకి మార్చారు. ఆసుపత్రిలో చికిత్సకు అవసరమైన సుమారు రూ. 3 కోట్ల విలువగల అధునాతన పరికరాలు, సామగ్రి మంజూరు కావడంతో గర్భిణులు, బాలింతలు, శిశువులకు నాణ్యమైన చికిత్స అందించారు. ఎంసీహెచ్‌పై ఆధారపడి 150 మంది వరకు మహిళలు, శిశువులు చికిత్స పొందుతుంటారు.

మూడు నెలలకే ముంపు బారిన భవనం....

నూతన భవనంలోకి ఎంసీహెచ్ మారిందనే సంతోషం మూడు నెలలకే ఆవిరైంది. ఆస్పత్రిలో అధికారికంగా చికిత్స ప్రారంభించిన సరిగ్గా మూడు నెలలకే.. అంటే 2022 జూలై 13న భవనం వరద ముంపునకు గురైంది. ఆరోజు కురిసిన భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి గేట్లు ఎత్తివేయడంతో గోదావరి ఉప్పొంగి వరద ఆసుపత్రి భవనాన్ని మొదటి అంతస్తు వరకు ముంచెత్తింది. ప్రమాదాన్ని పసిగట్టిన ఆస్పత్రి వైద్యులు చికిత్స పొందుతున్న రోగులను రాత్రికి రాత్రే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని పాత చోటుకే తరలించారు. రోగులకు ప్రాణాపాయం తప్పినప్పటికీ ఆస్పత్రిలో చికిత్సకు అవసరమైన అధునాతన ల్యాబరేటరీలు, అల్ట్రా సౌండ్ ఎక్స్‌రే యంత్రాలు, ఇతర పరికరాలు, లేబర్ రూం, ఆపరేషన్ థియేటర్, తదితర రూ. 3 కోట్ల విలువ చేసే పరికరాలతోపాటు..

- మిగతా 7లో


స్వాధీనం చేసుకున్న బంగారాన్ని పరిశీలిస్తున్న రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా

బ్యాంకు స్కామ్‌ను ఛేదించిన పోలీసులు

- 15కిలోల 237 గ్రాముల బంగారం స్వాధీనం
- రూ.1,61,730 నగదు స్వాధీనం
- 44 మంది నిందితుల అరెస్టు..పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా

6

కరాటే, కుంగ్‌ఫూ చరిత్ర గొప్పది

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్


మందమర్రిలో కరాటే పోటీల్లో ఏసీపీని సన్మానిస్తున్న నిర్వాహకులు

మందమర్రిటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కరాటే, కుంగ్‌ఫూ క్రీడకు ఎంతో చరిత్ర ఉందని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కంగ్‌ఫూ, కరాటే చాంపియన్ షిప్ పోటీలకు ఆయన హాజరై ప్రారంభించారు. ఆత్మ రక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. అనంతరం ఏసీపీని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ పోటీల్లో గ్రాండ్ మాస్టర్ కంటేష్, ఆలిండియా ఆల్ స్టైల్ కుంగ్‌ఫూ అసోసియేషన్‌నాయకులు రంగు శ్రీనివాస్, కనపర్తి రమేష్, హరి కృష్ణ కుందేళ్ల రవి, రవి, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం


ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీక్రిష్ణ నిరంతరం పాటుపడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ జిల్లా పట్టణ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని రైల్వే స్టేషన్ అభివృద్ధితో పాటు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం కోసం ఎనలేకి కృషి చేస్తున్నారన్నారు. ఎంపీ చొరవ వల్లనే మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైలు హాల్టింగ్ వచ్చిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు నెరువట్ల శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ హఫీజ్, కనకంరాజు, ఖలీల్, బండి శంకర్, విజయ్, వీరన్న, మహంత్ అర్జున్, ఉదయ్‌కుమార్, మాయ తిరుపతి, బియ్యపు కిరణ్‌లు పాల్గొన్నారు.

చెన్నూరు : నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే వందేభారత్ రైలును మంచిర్యాలలో ఆగేలా చేసిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటానికి ఆదివారం చెన్నూరు పట్టణంలో కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కురుమ రాజమల్లగౌడ్, చెన్నూరు మండల అధ్యక్షుడు ముత్యాల బాపగౌడ్, కోటపల్లి మండల అధ్యక్షుడు మహేష్ తివారీ, నాయకులు ఖలీల్, హేమంత్‌రెడ్డి, శ్రీధర్, నాగరాజు పాల్గొన్నారు.

గోల్డ్‌లోన్ బాధితుల సంబరాలు



టపాసులు కాల్చి సంబరాలు జరుపుకుంటున్న బాధితులు

చెన్నూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్‌బీఐ 2 బ్యాంక్ ముందు ఆదివారం రాత్రి గోల్డ్‌లోన్ బాధితులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. బ్యాంకు స్కామ్ కేసులో మొత్తం 44 మంది నిందితులను పోలీసులు అరెస్టుచేసి వారి వద్ద నుంచి పదిహేడున్నర కిలోల బంగారంతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నందుకు గాను పోలీసులను అభినందిస్తూ బ్యాంకు ముందు సంబరాలు జరుపుకున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

జన్నారం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరద బాధిత ప్రాంతాలను ఆదివారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ సందర్శించారు. కుండపోతల వాన ద్వారా అతలాకుతలం అయిన తిమ్మాపూర్, దాంపూర్, తపాల్‌పూర్ లోతట్టు ప్రాంతాల్లో, వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. పంట పొలాల్లోకి వెళ్లి పంటనష్ట పోయిన రైతులను పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వరదబాధితులకు పంట నష్ట పోయిన రైతాంగానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దెబ్బతిన్న పంటల కోసం జిల్లాకు కోటి రూపాయల చొప్పున సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేశారని, ఇండ్లు నష్టపోయిన, పంటల నష్ట పోయిన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆమెవెంట ఆయా గ్రామస్థులు కాంగ్రెస్ నాయకులు చంద్రయ్య, ప్రదీప్, కాంతయ్య, రవి, గుండలచ్చయ్య, భూమయ్య, శంకరయ్య, జాడిరాజన్న, ముత్తయ్య, పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం


జైపూర్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

జైపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ తల్లి హీరాబిన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను ఆదివారం జైపూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూట రాజ్‌కు మార్, నాయకులు రామగిరి రాము, వేముల రమేష్ గౌడ్,చంద్రమౌళి, శ్రీకాంత్, సాయి రాం, రవి పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ఆదివారం రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తల్లిపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన వాఖ్యలకు నిరసనగా రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సమయంలో పోలీసులు అడ్డుకోవడం శోచనీయం అన్నారు.

పోలీసుల వైఖరిని ఖండిస్తూ నాయకులు రాష్ట్ర రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈకార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్‌రావు, మండల అధ్యక్షుడు నాగిరెడ్డి హేమంత్‌రెడ్డి, నాయకులు జిల్లా కోశాధికారి రమేష్ చంద్ జైన్, నాయకులు వెం కటరమణ, బోడకుంట సతీష్, ఎంబడి వెంకటేష్, సుధాకర్, కోమాకుల రవి, ప్రభాకర్, రాకేష్, విహార్, సమరసింహ, సిద్ధార్థ్ పాల్గొన్నారు.

చెన్నూరు : బీజేపీనాయకులు ఆదివారం చెన్నూరు కొత్త బస్టాండ్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్‌లు మాట్లాడుతూ దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న మోదీ తల్లిపై రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీపాల్, రాజేశ్వర్, చారి, శివకృష్ణ, వెంకటేష్‌నరేష్, వినోద్, వెంకటేష్, రాజశేఖర్‌గౌడ్, సత్యం, శంకర్, రాజేశం, శ్రీనివాస్, దుషాంత్, సతీష్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను ఆదివారం ఆదిల్‌పేట గ్రామంలో బీజేపీ నాయకులు దహనం చేశారు. వెంటనే రాహుల్‌గాంధీ బహిరంగంగా క్షమా పణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు దేవరనేని సంజీవరావు, వంజరి వెంకటేష్, బోర్లకుంట లక్ష్మణ్, మంద శ్రీనివాస్, ప్రదీప్‌కుమార్, పెంచాల రంజిత్, రవికుమార్, రాజయ్య, మారుతి, మహేందర్ పాల్గొన్నారు.

తాండూర్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోరుతూ ఆదివారం తాండూర్ ఐబీ కేంద్రంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. వెంటనే రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలని లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కు మార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, నాయకులు శేషగిరి, తిరుపతి, కుమార్, సురే ష్, మల్లేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

విద్య సామాజిక మార్పునకు మేలు చేస్తుంది

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మార్పునకు విద్య ఎంతో మేలు చేస్తుందని, సమాజంలో రుగ్మతలను సైతం పారదోలడానికి విద్య ఉపయోగపడుతుందని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర రాజ కీయ శిక్షణతరగతుల్లో ఆయన పాల్గొన్నారు. పీడీఎస్‌యూ సంస్థాగత చిహ్నమైన బిగిపిడికిలి జెండాను రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ ఎగురవేశారు. అమర వీరుల సంతాప తీర్మాణాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు ప్రవేశపెట్టారు. అనంతరం ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం ద్వారా విద్యను పాలకులు వ్యాపారంగా మార్చారన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్ర మంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత, ఇఫ్టూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు లాల్‌కుమార్, శ్రీని వాస్, మహేష్, మధు, రాజేశ్వర్, కిరణ్, గౌత మ్‌కుమార్, మస్తాన్, నవీన్, అజయ్, తిరుపతి, శ్రీను, రాణా, దీపలక్ష్మీ, ఝాన్సీ పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఆమోదంతో సంబురాలు


బీసీ బిల్లు ఆమోదించినందుకు సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంచిర్యాలక్రైం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ రిజర్వేషన్‌లు క్లాస్ ఎత్తివేస్తూ బీసీలకు 42శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు అమలు చేసినందుకు మంచిర్యాల పట్టణ కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాలుస్తూ మిఠాయిలు పంచుతు సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లీఖార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి మినాక్షీ నటరాజన్, మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బాణాసంచాలు కాలుస్తూ మిఠాయిలు తినిపించుకొని సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణఅధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, బీసీసెల్ జిల్లా అధ్యక్షులు రాజమౌళి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్యాథలిక్ బిషప్‌గా తచ్చ పరంబత్

మంచిర్యాలక్రైం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా క్రైస్తవ బిషప్‌గా కేరళకు చెందిన తచ్చ పరంబత్ ఎన్నికయ్యారు. మంచిర్యాల పట్టణంలోని సాక్రీడ్‌హార్ట్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో బిషప్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్యాథలిక్ ఉమ్మడి జిల్లా వికార్ జనరల్‌జోష్ మానికేతర్‌చాన్స్‌లర్ జోషి హేబిన్, కోశాధికారి రాబిన్, మంచిర్యాల బిషప్ కురియన్, పీఆర్‌వో జాని, పాల్గొన్నారు.


బిషప్‌ను సన్మానిస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు రాజన్న

జన్నారం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ఎస్సీ ఎస్టీటీఎస్ తెలంగాణ రాష్ట్రఅధ్యక్షుడు జాడిరాజన్న అన్నారు. జన్నారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల నియమకాల్లో అనుసరిస్తున్న రిజర్వేషన్‌ను పదోన్నతుల కూడిన రిజర్వేషన్‌ను కల్పించాలని, క్యాడర్‌కు సరిపడా రిజర్వేషన్‌ను అమలు చేయాలని అన్నారు. పెండిం గ్‌లో ఉన్న సీపీఎస్, ఓపీఎస్‌లను అమలు చేయాలని, జీవో నంబర్ 317 నష్టపోయిన ఉపాధ్యాయులందరిని సొంతజిల్లాలకు పంపించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని, గెస్ట్, పార్ట్‌టైం ఉద్యోగులకు వేతనాలు పెంచాలని జిల్లాలకు డీఈ వోల పో స్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీసురూల్స్‌ను రూపొం దించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చే యాలన్నారు. అదేవిధంగా కేజీబీవీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు కనీసవేతనం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాదావత్ ప్రకాశ్‌నాయక్, రాంటెంకి శ్రీనివాస్, గోపాల్, జాడి ధర్మయ్య, శంకర్, రత్నం తిరుపతి, పాల్గొన్నారు.